సాక్షి
కర్నూలు
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో బుధవారం సాక్షిగణపతి స్వామికి, జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అలాగే అభిషేకాలు చేశారు.



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు బుధవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.



ముగిసిన మహాకుంభాభిషేకం

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో చౌడేశ్వరిదేవి మహాకుంభాభిషేక మహోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవాలు ఈ నెల 10న ప్రారంభమైన విషయం తెలిసిందే.

న్యూస్‌రీల్

20న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా–పారిశుద్ధ్యం, జిల్లా గ్రామీణాభివృద్ధి, జెడ్పీ, మండల పరిషత్‌లకు సంబంధించిన 2024–25 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్, 2003–24 ఆర్థిక సంవత్సరానికి సంబధించి సవరణ బడ్జెట్‌పై సమీక్ష నిర్వహిస్తామన్నారు. చైర్మన్ అనుమతితో ఇతర అంశాలపైనా సమీక్షకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశానికి హాజరు కావాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీపీలకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

దివ్యాంగులకు రేపు ఉద్యోగ మేళా

కర్నూలు(అర్బన్): నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు (దివ్యాంగులకు) ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎస్ రయిస్ ఫాతిమా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి యూత్ –4 జాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై 18 నుంచి 32 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన దివ్యాంగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పోలీస్ ఔట్ పోస్టులకు ప్రభుత్వ అనుమతి



ఎయిర్‌పోర్టు వద్ద పోలీస్ పహారా(ఫైల్)

కర్నూలు: జిల్లాలోని ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు వద్ద ప్రముఖుల భద్రత, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. అలాగే మంత్రాలయం దేవస్థానానికి వచ్చే భక్తులు, పర్యాటకుల భద్రత దృష్ట్యా ఏపీ ప్రభుత్వం అక్కడ టూరిస్ట్ పోలీస్ ఔట్‌పోస్టుకు అనుమతిస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు(మెమో) జారీ చేసింది. ఈ మేరకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాల్లో పోలీస్ ఔట్‌పోస్టుల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ఆయా ఔట్‌పోస్టులలో భద్రత, రక్షణ పరంగా ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా తగినంత పోలీసు సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు తెలిపారు. రెండు చోట్ల కూడా త్వరలోనే ఔట్ పోస్టులతో మెరుగైన భద్రత కల్పిస్తామన్నారు.

క్వింటా మిర్చి రూ.23,569

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట దిగుబడులకు మెరుగైన ధర లభిస్తోంది. మిర్చి మార్కెట్‌కు 879 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.1,099, గరిష్ట ధర రూ.23,569, సగటు ధర రూ.16,501 లభించింది. కందుల ధర కాస్త తగ్గింది. కనిష్ట ధర రూ.1,003, గరిష్ట ధర రూ.9,959, సగటు ధర రూ.9,609 నమోదైంది. మినుములు మార్కెట్‌కు 54 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.8,501, గరిష్ట ధర రూ.9,909, సగటు ధర రూ.9,539 పలికింది. శనగల గరిష్ట ధర రూ.5,021, సగటు ధర రూ.6,709 లభించింది.

పోలీసు సిబ్బంది బదిలీ

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న పది మంది సిబ్బందికి స్థానచలనం కలిగింది. వారు పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్ల నుంచి మరో ప్రాంతానికి బదిలీ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.

గ్రూప్‌–1కు ఉచిత శిక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో గ్రూప్–1 పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న చెంచు, సుగాలీ ఎరుకల, యానాది కులాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు దరఖాస్తు ఫారం, బయోడేటా, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి ఈనెల 18లోగా ఐటీడీఏ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

పశువుల్లోనూ అద్దె గర్భం

- ప్రయోగాత్మకంగా జిల్లాలో అమలుకు రంగం సిద్ధం
- 3 ఒంగోలు, 2 గిర్ జాతి పశువుల వీర్యంతో అభివృద్ధి చేసిన పిండాలు జిల్లాకు రాక
- అద్దెగర్భంలోకి పిండం బదిలీపై కొత్తాళం వెటర్నరీ డాక్టర్‌కు వారం రోజుల శిక్షణ
- జాతి పశువులు అంతరించిపోకుండా కాపాడుకునేందుకు సరోగసి చక్కటి అవకాశం



అద్దెగర్భంతో పుట్టిన దూడలు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): ఇప్పటి వరకు మనషులు సరోగసీ (అద్దె గర్భం) విధానంలో పిల్లలను కనడం తెలిసిందే. అయితే ఇప్పుడు పశువుల్లోనూ ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. జాతి పశువుల సంతతిని పెంచేందుకు నాణ్యమైన పశువుల వీర్యాన్ని సేకరించి పిండాభివృద్ధి చేస్తున్నారు. దీన్ని పశువుల గర్భంలోకి ఎక్కించి దూడలకు జన్మనిచ్చేలా చేస్తున్నారు. నెల్లూరు జిల్లా చింతలదీవి, గుంటూరులాం ఫామ్‌లో మేలు జాతి పశువుల వీర్యంలో పిండాలను అభివృద్ధి చేస్తున్నారు. వాటిని ఎంపిక చేసిన నాటు పశువుల గర్భంలో పెట్టడం ద్వారా స్వచ్ఛమైన జాతి దూడలు అభివృద్ధి చేస్తున్నారు. ఒక పిండం పూర్తి ధర రూ.10 వేలు ఉండగా... ప్రయోగాత్మకంగా ప్రస్తుతం ఉచితంగా వేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అద్దె గర్భం(సరోగసి)తో 100శాతం జాతి దూడలే పుట్టాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో కూడా ఈ ప్రక్రియను చేపట్టడానికి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం కొత్తాళం పశువైద్యుడు డాక్టర్ జగదీష్‌కు వారం రోజులు శిక్షణ కూడా ఇచ్చారు. ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసిన ఐదు పిండాలు కూడా సరఫరా అయ్యాయి. ఎంపిక చేసిన నాటు ఆవుల గర్భంలోకి పిండాలను బదిలీ చేస్తారు. మూడు ఒంగోలు, రెండు గిర్ జాతి పిండాలను రాగా కొత్తాళం పశువైద్యశాలలో భద్రపరిచారు.

పెరిగిన సాంకేతికత

పశుసంవర్ధకశాఖలో సాంకేతికత అభివృద్ధి చెందుతోంది. మొన్నటి వరకు కృత్రిమ గర్భధారణతో నాటు పశువుల్లో మేలు జాతి దూడలు అభివృద్ధి చేశారు. ఇప్పుడు లింగనిర్ధారిత వీర్యంతో 95 శాతం పెయ్య దూడలే పుట్టే సాంకేతిక అందుబాటులోకి వచ్చింది. తాజాగా మేలు జాతి పశువుల వీర్యంతో అభివృద్ధి చేసిన పిండాలను గర్భంలోకి ప్రవేశపెట్టే సాంకేతికత కూడా అందుబాటులోకి వచ్చింది. నాటు పశువులకు పిండమార్పిడి ద్వారా 100 శాతం స్వచ్ఛమైన జాతి దూడలే పడుతుండటం విశేషం.


398 మేలు జాతి పెయ్య దూడల అభివృద్ధి

లింగనిర్ధారిత వీర్యంతో ఇప్పటి వరకు 3261 నాటు అవులు, నాటు బర్రెలకు కృత్రిమ గర్భధారణ చేశారు. ఇందులో ఇప్పటి వరకు 426 పశువులు దూడలకు జన్మనిచ్చాయి. ఇందులో 398 పెయ్య దూడలే కావడం విశేషం. మామూలుగా అయితే పెయ్య దూడల బరువు 20–25 కిలోల వరకు ఉంటాయి. లింగనిర్ధారిత వీర్యంతో పుట్టిన దూడల బరువు 30–40 కిలోలు ఉంటోంది. రానున్న రోజుల్లో ఒకవైపు లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేసే కార్యక్రమాన్ని చేపడుతూనే మరో వైపు అద్దెగర్భంతో జాతి పశువులను అభివృద్ధి చేసే ప్రక్రియను కూడా చేపట్టనున్నారు.

ఎద అరిన తర్వాత 7 రోజులకు పిండం బదిలీ

పిండమార్పిడికి అవసరమైన నాటు ఆవులను గుర్తించి సిద్ధం చేసుకోవాలి. ఎదకు వచ్చి ఎద ఆరిపోయిన 7వ రోజు నాటు ఆవుల గర్భంలోకి పిండాన్ని బదిలీ చేస్తారు. ఇన్‌ఫెమినేషన్ గన్ ద్వారా గర్భంలోకి పిండాన్ని ప్రవేశ పెడుతారు. గర్భ కాలంలో ఎటువంటి మార్పు ఉండదు. ఆవులు 9 నెలల 9 రోజులకు, బర్రెలు 10 నెలల 10 రోజులకు ఈతకు వస్తాయి. అద్దెగర్భంతో 100 శాతం జాతి పెయ్య దూడలే పడుతాయి. ఐదు పశువులకు ఈ ప్రక్రియ విజయవంతమైన తర్వాత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపడుతారు. మేలు జాతి పశువుల అభివృద్ధికి సరోగసి చక్కగా తోడ్పడే అవకాశం ఏర్పడింది. రెండు, మూడు దశాబ్దాలతో పోలిస్తే జాతి పశువుల సంతతి తగ్గిపోతోంది. ఒంగోలు, గిర్, సాహివాల్ వంటి జాతి పశువుల సంతతిని, పాల ఉత్పత్తిని పెంచేందుకు అద్దెగర్భం తోడ్పడుతుందని అధికార యంత్రాంగం స్పష్టం చేస్తోంది.

చక్కటి అవకాశం



మేలు జాతి పశువుల అభివృద్ధికి సరోగసి చక్కటి అవకాశం. ఇంతవరకు లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. ఇందులో 95 శాతం పెయ్య దూడలే పుడుతున్నాయి. అయితే ఈ దూడల్లో 100 శాతం జాతి పశువుల లక్షణాలు ఉండవు. అద్దెగర్భంతో పుట్టిన దూడలు 100 శాతం జాతి పశువుల లక్షణాలు ఉంటాయి. ప్రస్తుతం కొత్తాళానికి 5 పిండాలు వచ్చాయి.

– డాక్టర్ రాజశేఖర్, డీడీ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, కర్నూలు

పోస్టల్ సూపరింటెండెంట్‌గా విజయజ్యోతి



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయజ్యోతి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ఎస్ విజయజ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె కర్నూలు బీక్యాంప్‌లోని కార్యాలయంలో కర్నూలు రీజియన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్‌గా విధులు నిర్వర్తించేవారు. పదోన్నతిపై కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తపాలా శాఖ బహుళ ప్రయోజనాలు కలిగిన సేవలను ప్రజలకు వేగంగా, నమ్మకంగా అందిస్తోందన్నారు. దేశంలోనే కాకుండా విదేశాల్లో ఉన్న వారికి సైతం నమ్మకంగా పార్శిళ్లను చేరవేస్తోందన్నారు. తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నాలుగు స్కానింగ్ కేంద్రాలకు అనుమతి

కర్నూలు(హాస్పిటల్): కొత్తగా నాలుగు స్కానింగ్ కేంద్రాలకు జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటి అనుమతి ఇచ్చింది. బుధవారం ఆర్‌డీవో మధుసూదన్‌రావు అధ్యక్షతన మున్సిఫ్ కోర్టు 7వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి భూపాల్‌రెడ్డి చాంబర్‌లో జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ అమలు తీరుపై చర్చించారు. తనిఖీ పూర్తి చేసి జిల్లా స్థాయి సలహా కమిటీ సిఫారసు చేసిన స్కానింగ్ కేంద్రాల నాలుగు కొత్త రిజిస్ట్రేషన్లు, ఆరు రెన్యువల్స్, రెండు మాడిఫికేషన్ అప్లికేషన్స్‌ను కమిటీ ఆమోదించింది. ఆడపిల్లల సంరక్షణ కోసం ఎన్‌జీవోల సహాయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఎన్‌జీవో ప్రతినిధులు డాక్టర్ బాలమద్దయ్య, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డెమో ప్రమీలాదేవి, ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు సీఎం వైఎస్ జగన్

- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనువడి వివాహానికి హాజరు
- పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసిన అధికారులు



సిద్ధమైన హెలిప్యాడ్

కర్నూలు(సెంట్రల్)/కర్నూలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కర్నూలుకు రానున్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనువడు పవన్ కల్యాణ్‌రెడ్డి వివాహానికి హాజరు కానున్నారు. కర్నూలులోని బళ్లారి చౌరస్తా సమీపాన కింగ్ ప్యాలెస్ గ్రాండ్‌లో వివాహం జరుగుతుండటంతో ఆయా పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా వివాహం జరిగే కింగ్ ప్యాలెస్ గ్రాండ్‌కు సమీపంలోనే ప్రత్యేక హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గన్నవరం నుంచి విమానంలో బుధవారం ఉదయం 10.50 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కర్నూలులోని కింగ్ ప్యాలెస్ గ్రాండ్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 11.10 గంటలకు చేరుకుని అక్కడ ప్రజాప్రతినిధులతో ముచ్చటిస్తారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించి తిరుగు ప్రయాణమవుతారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి సూచించారు. హెలిప్యాడ్ నుంచి కల్యాణ మండపం వరకు బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీఎం సెక్యూరిటీ అధికారి రాజారెడ్డి, అడిషినల్ ఎస్పీ నాగరాజు, ఏఆర్ అడిషినల్ ఎస్పీ నాగబాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ ఉమాపతి పాల్గొన్నారు.

ఉలిందకొండలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి ప్లాంట్

- 20 ఎకరాల్లో రూ.110 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు
- వర్చువల్‌గా భూమి పూజ చేసిన మంత్రి అమర్‌నాథ్
- యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు: కలెక్టర్ సృజన



కంప్రెస్ట్ బయోగ్యాస్ ఉత్పత్తి ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): గ్లోబల్ సమ్మిట్ ఇన్వెస్ట్‌మెంట్‌లో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కర్నూలు జిల్లా కల్లూరు మండలం ఉలిందకొండలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రూ.110 కోట్ల పెట్టుబడితో 20 ఎకరాల విస్తీర్ణంలో రిలయన్స్ బయో ఎనర్జీ సంస్థ సహకారంతో ఏర్పాటయ్యే ప్లాంట్‌కు బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ వర్చువల్‌గా భూమి పూజ నిర్వహించారు. రాష్ట్రంలో తొలి దశలో కర్నూలు, కాకినాడ, విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు ప్రాంతాల్లో రూ.1,024 కోట్ల పెట్టుబడితో 302 ఎకరాల్లో కంప్రెస్డ్ న్యాచురల్ బయోగ్యాస్ ఉత్పత్తి ప్లాంట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్, పరిశ్రమలు, ఏపీఐఐసీ అధికారులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన మాట్లాడుతూ..సేంద్రీయ, వ్యవసాయ ముడి పదార్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి అవుతుందని, దీనిని కర్నూలులో ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని, భవిష్యత్తులో కర్నూలు జిల్లాలో పరిశ్రమల విస్తరణ పుంజుకుంటుందని చెప్పారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల కోసం 9,900 ఎకరాలను కేటాయించామని, హబ్‌కు మౌలిక వసతుల కోసం మల్యాల నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తెప్పించే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. అలాగే హబ్‌కు రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీఐఐసీజోనల్ మేనేజర్ సోమశేఖరరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం మారుతి ప్రసాదు, డిప్యూటీ డైరెక్టర్ రమణారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయకుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్ పాల్గొన్నారు.

దామోదరం సేవలు చిరస్మరణీయం



భారీ కేక్‌ను కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, మేయర్ రామయ్య

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన
- 103 కేజీల కేక్‌ను కట్ చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు



సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు(అర్బన్): దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమైనవని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు మూడు రోడ్ల కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్‌తో పాటు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సంజీవయ్య పెద్దపాడు గ్రామంలోని నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి ఆంధ్ర రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా సేవలు అందించారన్నారు. 38 ఏళ్ల పిన్న వయస్సులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఘనత సంజీవయ్యకే దక్కుతుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సంజీవయ్య నీతి, నిజాయితీలకు మారుపేరుగా నిలిచారన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ఉన్నత విద్యను అభ్యసించి, అనేక ఉన్నత పదవులను అలంకరించిన దామోదరం అడుగు జాడల్లో యువత నడవాలన్నారు. అనంతరం 103 కేజీల భారీ కేకును అధికారులు, ప్రజాప్రతినిధులు కట్ చేశారు. కార్యక్రమంలో సీపీఓ హిమప్రభాకరరాజు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జే రంగలక్ష్మీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ శ్రీనివాసకుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు కే బాబు, బీ మద్దిలేటి, సుధాకర్‌బాబు, డీవీఎంసీ సభ్యులు గద్ద రాజశేఖర్, వివిధ ప్రజా, దళిత సంఘాల నాయకులు సోమసుందరం మాదిగ, వేల్పుల జ్యోతి, సోగరాజు మునెయ్య, డీపీ సోమన్న, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ప్రావిజనల్ మెరిట్ లిస్ట్

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటల్స్, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీలకు సంబంధించిన 30 కేటగిరీల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు నవంబర్ 20న జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి దరఖాస్తు చేసుకున్న 26 కేటగిరీల అభ్యర్థుల ప్రావిజనల్ మెరిట్‌లిస్ట్‌ను విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను వెబ్‌సైట్‌లు https://kurnool.ap.gov.in,https://nandyal.ap.gov.in,https://kurnoolmedicalcollege.ac.inలో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు వివరాలను సరిచూసుకుని అభ్యంతరాలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ సాయంత్రంలోపు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందజేయాలన్నారు.

బీఈడీ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2023 ఆగస్టులో నిర్వహించిన బీఈడీ నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్ఛ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 847 మంది ఛాత్రోపాధ్యాయులు పరీక్షలు రాయగా 777 మంది ఉత్తీర్ణులయ్యారని, 70 మంది ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.



సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు, చిన్నారులు

సరస్వతీ..నమస్తుభ్యం

కొత్తపల్లి మండలం శివపురం సమీపంలోని కొలనుభారతిదేవి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలు కనుల పండువగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. సరస్వతీ దేవి అలంకరణలో కొలనుభారతిదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

– కొత్తపల్లి



సరస్వతీ దేవి అలంకరణలో కొలనుభారతి దేవి

క్లుప్తంగా

డ్రంకన్‌డ్రైవ్‌లో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను బుధవారం ఖరారు చేసినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. స్థానిక పొగాకు కంపెనీ జంక్షన్ వద్ద నడిగడ్డకు చెందిన షేక్ జకిరియా మద్యం తాగి వాహనం నడుపుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి కోర్టులో జడ్జి ఎదుట హాజరు పరచగా 14 రోజులు జైలు శిక్షను ఖరారు చేసినట్లు వారు తెలిపారు.

మార్కెట్ ఫీజు 100 శాతం వసూలు చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరానికి సంబంధించి మార్కెట్ ఫీజు 100 శాతం వసూలుకు చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ రాయలసీమ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు మార్కెట్ కమిటీ సెక్రటరీలను ఆదేశించారు. బుధవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఏడీఎం కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో జాయింట్ డైరెక్టర్ మాట్లాడారు. మార్కెట్ ఫీజు లక్ష్యాలను అధిగమించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెక్‌పోస్టులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మార్కెట్ కమిటీల ఆదాయం లీక్ కాకుండా ఉండేందుకు ప్రత్యేక టీమ్‌లు వేసి తనిఖీలు చేయించాలని పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి మార్కెట్ ఫీజు లక్ష్యాలను 20 శాతం అధనంగా ఉండేలా బడ్జెట్ ప్రతిపాదనలు గురువారం లోగా సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఏడీఎం నారాయణమూర్తి, నంద్యాల ఏడీఎం రహిమాన్, కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు, నంద్యాల మార్కెట్ కమిటీ సెక్రటరీ కల్పన తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జూపాడుబంగ్లా: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్‌ఐ మేరీజయంతి తెలిపిన వివరాలు.. కొత్తపల్లి మండలం పాతసిద్దేశ్వరం గ్రామానికి చెందిన కోటకొండ నరేష్(28)కు బండిఆత్మకూరు మండలం పెద్దదేవలాపురం గ్రామానికి చెందిన పార్వతికి మూడు నెలల క్రితం వివాహమైంది. వీరు జూపాడుబంగ్లా మండలం కొత్తసిద్దేశ్వరం గ్రామ పరిధిలోని పొలంలో కంది సాగు చేశారు. నూర్పిడి నిమిత్తం రెండు రోజుల కొత్తసిద్దేశ్వరం గ్రామానికి చేరుకున్నారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లే క్రమంలో మంగళవారం పురుగు మందు తాగి మంచంపై స్పృహ తప్పి పడిపోయాడు. భార్య గమనించి స్థానికులతో కలిసి కర్నూలు ఆస్పత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. కాగా అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కృష్ణగిరి: చికిత్స పొందుతూ కోలుకోలేక రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కమ్మ గంగాధర్(30) మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 10వ తేదీ శనివారం రాత్రి గొడవపడి క్షణికావేశంలో భార్య, భర్తలు కమ్మ మానస(27), కమ్మ గంగాధర్(30) పురుగుల మందు తాగారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 11వ తేదీ ఆదివారం మానస మృతి చెందింది. ఆమె భర్త కమ్మ గంగాధర్ సైతం కర్నూలు ఆసుపత్రిలోనే వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన మానస మృతి చెందిన తర్వాత ఆమె తండ్రి నారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, కుటుంబ సభ్యులపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా.. తల్లిదండ్రుల మృతితో వారి కుమారుడు నాలుగేళ్ల సాకేత్‌రామ్ అవ్వాతాతల వద్ద ఉన్నాడు.



మృతి చెందిన కమ్మ గంగాధర్

కనుల పండువగా ‘వసంత’ వేడుక

మాఘ శుద్ధ పంచమి(వసంత పంచమి)ని పురస్కరించుకొని బుధవారం సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. సరస్వతీ దేవి ఆలయాల్లో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవాలు, హోమాలు నిర్వహించారు. –సాక్షినెట్‌వర్క్



నంద్యాల: ప్రథమ నంది గాయత్రి ఆలయంలో సరస్వతీదేవికి పెన్నులతో అలంకారం



జూపాడుబంగ్లా: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



కర్నూలు: చిన్నారితో అక్షరాలను దిద్దిస్తున్న అమ్మ



కర్నూలు: ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



సంజామల: కానాల పాఠశాలలో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న విద్యార్థినులు



బండిఆత్మకూరు: కాకనూరు శారదాపీఠంలో కుంకుమార్చన



కోవెలకుంట్ల: సరస్వతీమాత ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కర్నూలు: నన్నూరు సమీపంలోని ఆలయంలో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న పూజారి



బేతంచెర్ల: సరస్వతీ హోమ క్రతువులో పాల్గొన్న తల్లిదండ్రులు, చిన్నారులు



కర్నూలు: అక్షరాభ్యాస పూజలు చేస్తున్న అర్చకుడు

ఓట్ల లెక్కింపు కేంద్రాలపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం

● జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఓటర్ల జాబితా, స్ట్రాంగ్ రూముల నిర్వహణ తదితర అంశాలపై డీఆర్‌ఓ పద్మజతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకుడికి చెందిందనే ఆక్షేపణలు రావడంతో ఆర్జీఎం కాలేజ్‌ను లెక్కింపు కేంద్రం నుంచి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, శాంతిరాం ఇంజినీరింగ్ కాలేజీలలో ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అనుకూలంగా ఉన్నాయని, వీటిపై కూడా అభ్యంతరాలు ఎదురైతే కర్నూలు జిల్లా కేంద్రంలోని రాయలసీమ యూనివర్సిటీలోనే ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సయ్యద్ రియాజ్ బాషా, తెలుగుదేశం పార్టీ నాయకులు శివరామిరెడ్డి, బీజేపీ నాయకులు అభిరుచి మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

‘ఉపాధి’ పనులు భేష్



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎన్‌ఐఆర్‌డీ ప్రతినిధులు

● కితాబిచ్చిన ఎన్‌ఐఆర్‌డీ ప్రతినిధులు

ఓర్వకల్లు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు చాలా బాగున్నాయని ఎన్‌ఐఆర్‌డీ ప్రతినిధుల బృందం ప్రసింశించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వేర్వేరు గ్రామాలలో చేపట్టిన ఉపాధి పనులను బృంధం ప్రతినిధి నీరజ నేతృత్వంలో 27 మంది సభ్యులు పరిశీలించారు. హుసేనాపురంలో చెక్‌డ్యామ్‌లో పూడితీత పనులు, ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ను పరిశీలించారు. అనంతరం చింతలపల్లె గ్రామంలో చీనీ తోట పెంపకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఓర్వకల్లు మండల మహిళా సమాఖ్య భవనంలో పవర్ ప్లాంట్ ప్రజెంటేషన్(పీపీటీ) ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల పనులను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి వివరించారు. జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మించుకున్న ఇళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, అదనపు పీడీ మాధవీలత, ఏపీడీలు కృష్ణమోహన్, లక్ష్మన్న, ఎంపీడీఓ మల్లీశ్వరి, సీఎల్‌ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్ సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: జిల్లాలోని పలు దేవస్థానాలకు ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలోని శ్రీ రూపాల సంఘమేశ్వర స్వామి దేవస్థానం, ఆదోని మండలం ఆదోని గ్రామంలోని శ్రీ కోట వీరభద్ర స్వామి దేవస్థానం, వెంగలాపురం ఆంజనేయ స్వామి దేవస్థానం, శ్రీ అంబా భవాని దేవత దేవస్థానం, కౌతాళం మండలం ఉప్పరహాల్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల నియామకానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను మార్చి 1వ తేదీలోగా నగరంలోని మద్దూర్ నగర్‌లో ఉన్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు





గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామి వారు, సరస్వతీ హోమంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు బుధవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, సరస్వతీ హోమం చేశారు. స్వామి వారిని గరుడ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కే మనోహర రావు, కమిటీ సభ్యులు సోమనాథ మూర్తి, రామ మనోహర్, ప్రభాకర్, ఉమేష్, వాయుసేన సేవాదళ్, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావొద్దు

● డీఈఓ శామ్యూల్

కర్నూలు కల్చరల్: పరీక్షల సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకూడదని డీఈఓ శామ్యూల్ అన్నారు. నేషనల్ చైల్డ్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్‌కు పరీక్షా పర్వ్ పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల ఇష్టాలను, వారి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త సీహెచ్ విజయజ్యోతి కుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలన్నారు. ప్రధాన వక్త చిట్టిబాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు పాజిటివ్ దృకృథాన్ని అలవర్చాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఉప విద్యాధికారి హనుమంతరావు, ఆఫీస్ పర్యవేక్షకులు కోటేశ్వరరావు, సెక్టోరియల్ ఆఫీసర్స్ కె.సునీతా రెడ్డి, జి.సురేష్ రాజు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ శ్యామూల్

ఈరన్నస్వామికి 1.2 కేజీల వెండి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామికి 1.270 కేజీల వెండిని కర్ణాటక రాష్ట్రం బళ్లపూర్ (కంప్లి)కు చెందిన జె.వీరేష్, ఆయన కుటుంబ సభ్యులు బుధవారం విరాళంగా అందజేశారు. సంప్రదాయం ప్రకారం దాతలతో స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, పర్యవేక్షకులు మల్లికార్జున, రామ్మోహన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

18ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు



మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయించాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో తుది ఓటరు జాబితా ప్రచురణ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల సౌకర్యార్థం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులను సిద్ధం చేయాలన్నారు. 80 సంవత్సరాలు నిండిన ఓటర్లకు ఇంటిదగ్గరే ఓటు వేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆసక్తి ఉన్న వారిని నుంచి 12డీ దరఖాస్తులను స్వీకరించాలన్నారు.

మహానంది ఆలయ అభివృద్ధికి కృషి

● ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



వసతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా, చిత్రంలో ఆలయ అధికారులు

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మహానంది దేవస్థానంలో రూ.10.50 కోట్ల దేవస్థానం నిధులతో నూతనంగా నిర్మించనున్న నంది సదనంలో 50 వసతి గృహాల సముదాయానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయ కార్యనిర్వాహణాధికారిగా కాపు చంద్రశేఖర్ రెడ్డిని నియమించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే దేవస్థానం ప్రాంగణంలో తన సొంత డబ్బు రూ.మూడు కోట్లు వెచ్చించి సుందరీకరణ పనుల్లో భాగంగా ల్యాండ్ స్కేపింగ్, భక్తులు ఆహ్లాదంగా సేద తీరేందుకు పార్కులు, రాతితో బెంచీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో మహానంది ఆలయం నిరాదరణకు గురైందన్నారు. కనీసం సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉండేదన్నారు. ప్రస్తుతం రూ.18 కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. త్వరలోనే మహానంది ఆలయం డిప్యూటీ కమిషనర్ హోదా నుంచి రీజినల్ జాయింట్ కమిషనర్ హోదాకు చేరుతుండటం హర్షించదగిన విషయమన్నారు. బండిఆత్మకూరు మండలం నవనందుల్లో ఒకటైన కృష్ణనంది, ఓంకారం ఆలయ పరిధిలోని భూముల వివాదాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మహానందీశ్వర స్వామి సొమ్మును దోచుకున్నారు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకులు మహానందీశ్వర స్వామి సొమ్మును దోచుకున్నారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆలయ అభివృద్ధికి పాటుపడుతూ ఈఓ, ధర్మకర్తల మండలికి పూర్తి అధికారాలు ఇస్తూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వచ్చానన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.4.60 కోట్ల నిధులను రాబట్టి వసతి గృహాల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రూ.80 లక్షలతో కోనేరుల మరమ్మతులు సాగుతున్నాయన్నారు. శ్రీశైలం ఆలయాన్ని తిరుమల తరహాలో, మహానంది ఆలయాన్ని శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

వేతనాలను పెంచేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డితో పాటు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొమ్మ మహేశ్వర్ రెడ్డిలను మహానంది దేవస్థానం ఏజెన్సీ ఉద్యోగులు సన్మానించారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలతో ఎమ్మెల్యే శిల్పా మాట్లాడి ఒక్కొక్కరికి సుమారు రూ.5 వేలకు పైగా వేతనం పెరిగేందుకు దోహదపడ్డారని ఏజెన్సీ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మండల నేత ఒంటెద్దు వీరారెడ్డి, సర్పంచ్ శిరీష, మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, ఎంపీటీసీ బంగి వెంకటేశ్వర్లు, నిత్యాన్నదాన కూరగాయల దాత టి.ప్రసాద్, సీనియర్ నేతలు కొండా మధుసూదన్‌రెడ్డి, రవిస్వామి, కుంచపు శ్రీనివాసులు, రఘురామిరెడ్డి, ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు పాల్గొన్నారు.